క్లుప్తంగా...

రేపటి నుంచి మళ్లీ మాణిక్‌రావ్ పర్యటన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే మూడోసారి తెలంగాణకు రానున్నారు. ఈ నెల మూడో తేదీ నుంచి ఆరో తేదీ వరకు నాలుగు రోజులు రాష్ట్రంలో పర్యటించనున్నారు. మూడో తేదీన సాయంత్రం 5 గంటలకు ఠాక్రే హైదరాబాద్‌కు వస్తారని, శంషాబాద్ విమానాశ్రయం నుంచి గాంధీభవన్‌కు వచ్చి రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో సమావేశమవుతారని బుధవారం గాంధీభవన్ విడుదల చేసిన షెడ్యూల్‌లో పేర్కొంది. నాలుగున కూడా ఆయన ఆహ్వానితులతో భేటీ అవుతారు. ఐదో తేదీన రాష్ట్ర కాంగ్రెస్‌కు చెందిన వివిధ విభాగాల నేతలతో సమావేశమవుతారు. ఐదో తేదీన టీపీసీసీ ప్రచార కమిటీ, సోషల్ మీడియా కమిటీ, ఓబీసీ విభాగం, ఎస్సీ, మైనార్టీ విభాగాల నేతలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో సమావేశమవుతారు. ఆరో తేదీ ఉదయం టీపీసీసీ నేతలతో మరోమారు భేటీ కానున్న ఠాక్రే.. మధ్యాహ్నం బయలుదేరి ములుగులో జరిగే హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా నిర్వహించనున్న బహిరంగ సభకు హాజరవుతారు.

అందుబాటులో చేప వంటకాలు: తలసాని



సాక్షి, హైదరాబాద్: ప్రజలకు వివిధ రకాల చేప వంటకాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మాసాబ్ ట్యాంక్‌లోని మత్స్యశాఖ కార్యాలయం ఆవరణలో బుధవారం రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా అభివృద్ధి చేసిన ఫిష్ క్యాంటీన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చేపల వినియోగాన్ని పెంచేందుకు.. చేపల వంటకాలపై మహిళలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చేపలు, చేప వంటకాల విక్రయాల కోసం రాయితీపై మొబైల్ రిటైల్ ఫిష్ ఔట్ లెట్‌లను కూడా అందజేశామన్నారు. మత్స్య శాఖ నిర్వహిస్తున్న క్యాంటీన్‌లో లభించే చేప వంటకాలకు ఆదరణ పెరగడంతో.. వచ్చే వినియోగదారులకు సౌకర్యాలు కల్పించినట్టు వివరించారు. త్వరలోనే వివిధ రకాల వంటకాలతో కూడిన ఫిష్, మటన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అధర్ సిన్హా, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రాంచందర్, టీఎస్ఎల్‌డీఏ సీఈవో మంజువాణి పాల్గొన్నారు.

ఏపీలో అందరికీ సమాన అవకాశాలు

- ప్రభుత్వ స్కూళ్లు బాగున్నాయి
- సీఎం జగన్ అత్యున్నత లక్ష్యం కోసం పనిచేస్తున్నారు
- ఆయన్ని కలవడాన్ని గౌరవంగా భావిస్తున్నా
- ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్



సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్

సాక్షి, అమరావతి: 'ఇప్పటివరకు 78 దేశాల్లో పర్యటించా. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తున్న సీఎం జగన్ లాంటి వ్యక్తిని నేను ఎక్కడా చూడలేదు'అని ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ అత్యున్నత లక్ష్యం కోసం.. ఉన్నతమైన ఆశయాలతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఆయన్ని కలవడాన్ని గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. బుధవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌ను నిక్ వుజిసిక్ కలిశారు. ఈ సందర్భంగా నిక్ మాట్లాడుతూ..'ఏపీలోని ప్రభుత్వ స్కూళ్లు బాగున్నాయి. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా.. ప్రభుత్వ స్కూళ్లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నారు. విద్యా రంగంలో అందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే గొప్ప లక్ష్యంతో సీఎం జగన్ పనిచేస్తుండటం.. చాలా ఆసక్తికరమైన అంశం. ఏపీలో విద్యార్థుల ఎదుగుదలకు మంచి అవకాశాలున్నాయి. ఈ విషయంలో సీఎం జగన్ గురించి చెప్పాలంటే ఆయన నిజమైన హీరో. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో గణనీయమైన ప్రగతి కనిపిస్తోంది. ఇవన్నీ అందరికీ తెలియాలి. ఇంతవరకూ ఇలా ఎక్కడా జరగలేదు. ఆయన చాలా నిబద్ధత, క్రమశిక్షణ గల మనిషి'అని నిక్ చెప్పారు. తన జీవిత కథను పదో తరగతి ఇంగ్లిష్ పుస్తకంలో పాఠ్యాంశంగా ప్రవేశపెట్టడం ఆనందంగా ఉందని తెలిపారు.

మెరుగవుతోన్న తారకరత్న ఆరోగ్యం

ఎంపీ విజయసాయిరెడ్డి వెల్లడి

బనశంకరి: నందమూరి తారకరత్న ఆరోగ్యం నిలకడగా ఉందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తెలిపారు. బుధవారం బెంగళూరులో నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తారకరత్నను విజయసాయిరెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.



తారకరత్న కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం తారకరత్న ఆరోగ్యం నిలకడగా ఉంది.. పురోగతి కనిపిస్తోందని తెలిపారు. డాక్టర్లు మంచి చికిత్స అందిస్తున్నారని, బాలకృష్ణ అక్కడే ఉండి అన్ని విషయాలు చూసుకుంటున్నారని చెప్పారు. తారకరత్నకు గుండెపోటు వచ్చిన 45 నిమిషాల పాటు మెదడుకు రక్తప్రసరణ ఆగిపోవడం వల్ల నరాలు కాస్త దెబ్బతిన్నాయని, ఇవాళ పరిస్థితి చాలా మెరుగ్గా ఉందన్నారు. గుండెతో పాటు రక్తప్రసరణ బాగుందని, రేపటి కల్లా మరింత మెరుగవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా బాలకృష్ణకు విజయసాయిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.



ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి కుమార్తె వివాహానికి సీఎం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని కొంపల్లిలో బుధవారం జరిగిన ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సీఎం వెంట మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులున్నారు.

కలిసొస్తున్నా కోవర్టు ముద్ర వేస్తున్నారు

- రేవంత్‌పై అధిష్టానానికి ఎంపీ కోమటిరెడ్డి ఫిర్యాదు!

సాక్షి, న్యూఢిల్లీ: విభేదాలను పక్కనపెట్టి కలిసి పని చేసేందుకు ముందుకు వస్తున్నాతనపై కోవర్టు ముద్ర వేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మరోమారు కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. రేవంత్ తీరుపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీకి వచ్చిన కోమటిరెడ్డి బుధవారం ముగ్గురు నేతలను విడివిడిగా కలిసి ఇటీవలి నకిరేకల్‌లో తనకు వ్యతిరేకంగా వెలసిన పోస్టర్ల అంశంపై ఫిర్యాదు చేసినట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. రేవంత్ సూచనల మేరకు పార్టీ రాజకీయ వ్యూహకర్త సునీల్ కనుగోలు బృందంలోని సభ్యుడి పురమాయించడంతో కొందరు వ్యక్తులు తనను కోవర్టుగా ముద్రిస్తూ పోస్టర్లు వేశారని వివరించారు. దీనిపై తాను స్వయంగా సునీల్‌తో మాట్లాడగా, క్షమాపణలు సైతం కోరారని తెలిపారు. దీనిపై రేవంత్‌తో మాట్లాడతామని ఖర్గే సహా ఇతర నేతలు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

బడ్జెట్‌పై ప్రతి శాఖకు ఓ నోడల్ అధికారి

పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: ఈనెల 3వ తేదీ నుంచి జరగనున్న బడ్జెట్ సమావేశాలకు అన్ని ప్రభుత్వ శాఖలు సిద్ధంగా ఉండాలని పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఆదేశించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఆయన ప్రభుత్వ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో బుధవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల కోసం ప్రతి శాఖకు ఒక నోడల్ అధికారిని నామినేట్ చేయాలని ఆదేశించారు. శాఖల వారీగా ప్రశ్నలకు సమాధానాల సమర్పణ, అసెంబ్లీ అధికారులతో సమన్వయపరుచుకునే బాధ్యత వారిదేనని స్పష్టం చేశారు. సభా వ్యవహారాలు, జీరో అవర్‌లో సభ్యులు లేవనెత్తే సమస్యలు, ఇతర సంబంధిత విషయాలను ముందుగానే తెలియజేయాలని సూచించారు. సమావేశాల్లో సీనియర్ అధికారులు ఉండేలా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని ఆడిట్ పేరాలపై ప్రత్యుత్తరాలు సమర్పించాలని పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాలను దృష్టిలో ఉంచుకుని గ్రాంట్ల సమాచారం కూడా ఇవ్వాలని, అధికారులందరూ పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

రాష్ట్రంలో 6 నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్ర: రేవంత్

సాక్షి, న్యూఢిల్లీ : తెలంగాణలో ఈ నెల 6 నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్ర ప్రారంభమవుతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తెలిపారు. ములుగు సమ్మక్క సారలమ్మ నుంచి ప్రారంభమయ్యే యాత్రను మొదటివిడతగా 60 రోజులు.. 40 నుంచి 50 నియోజకవర్గాల్లో చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాత్రలో జాతీయ నాయకత్వం కూడా వివిధ సందర్భాల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. 60 రోజుల తర్వాత యాత్రను కొనసాగించే అంశంపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రతి అంశంపై సమగ్ర చర్చ జరగాలి

- తెలంగాణ అసెంబ్లీ పనితీరు దేశానికే ఆదర్శం: స్పీకర్ పోచారం
- బడ్జెట్ సమావేశాల ఏర్పాట్లపై స్పీకర్, మండలి చైర్మన్ సమీక్ష
- సీఎస్, డీజీపీ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరు



సమీక్ష సమావేశంలో వేముల, పోచారం, గుత్తా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసన మండలి సమావేశాలు ఈనెల 3న ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఏర్పాట్లపై బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, డీజీపీ అంజనీ కుమార్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నర్సింహాచార్యులుతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల పనితీరు దేశానికే ఆదర్శంగా ఉందని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాలు పారదర్శకంగా జరిగేందుకు గతంలో మాదిరిగానే అధికారులు సహకరించాలని కోరారు. శాసనసభ సమావేశాల హుందాతనం, ఔన్నత్యాన్ని కాపాడుకుంటూ ప్రతీ అంశంపై సమగ్ర చర్చ జరగాలన్నారు. సభ్యులు అడిగే సమాచారాన్ని త్వరగా ఇవ్వడంతో పాటు గత సమావేశాలకు సంబంధించి ప్రశ్నలకు పెండింగులో ఉన్న జవాబులు వెంటనే పంపించాలని ఆదేశించారు. సమావేశాలు జరిగే సమయంలో ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు అందుబాటులో ఉండాలని, ప్రతీ శాఖ తరఫున ఒక నోడల్ అధికారిని నియమించాలని స్పీకర్ సూచించారు. శాసనసభ కమిటీలకు అవసరమైన సమాచారాన్ని ప్రభుత్వం తరఫున అందించాలని, శాసనసభ పరిసరాల్లో విద్రోహశక్తులు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు.

ప్రశాంత వాతావరణంలో సమావేశాలు: గుత్తా

తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అనేక మంచి పథకాలు అమలు చేస్తోందని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కితాబునిచ్చారు. అసెంబ్లీ లోపల, బయటా ప్రశాంత వాతావరణంలో సమావేశాలు జరిగేలా పోలీసు అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో శాసనసభలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మండలి విప్ ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, పోలీసు కమిషనర్లు సీవీ ఆనంద్, డీఎస్ చౌహాన్, స్టీఫెన్ రవీంద్ర, చీఫ్ మార్షల్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

వరిలో మొగిపురుగు నివారణకు చర్యలు

మధిర: యాసంగి సీజన్‌లో వరి సాగు చేస్తున్న రైతులు మొగిపురుగు నివారణపై దృష్టి సారించాలని మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణీదేవి సూచించారు. వరి నాట్లు వేసిన 30 రోజుల్లోగా మొగిపురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపడితే ఫలితం ఉంటుందని తెలిపారు. ఈమేరకు వేపనూనె 10,000 పీపీఎం రెండు మి.లీ.ను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఇంకా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు లేదా ఫ్రిఫానిల్ గుళికలు నాలుగు కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలను 20 కిలోల ఇసుకలో కలిపి చల్లాలని తెలిపారు. అలాగే, హెక్టార్‌కు ఎనిమిది లింగాకర్షక బుట్టలను అమర్చుకుని పురుగు ఉధృతిని గమనించాలని సూచించారు. వారం వ్యవధిలో బుట్టల్లో 30 నుంచి 35 పురుగులు పడితే కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 డబ్ల్యూపీ 400 గ్రాములు లేదా క్లోరంట్రా నిలిప్రోల్ 18.5 ఎస్సీ 60 ఎంఎల్‌ను ఎకరాకు పిచికారీ చేయాలని ఆమె తెలిపారు.

గురుకులాల్లో బోధనా సిబ్బంది నియామకం

భద్రాచలం: ఖమ్మం రీజియన్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో తాత్కాలిక ప్రాతిపదికన బోధన సిబ్బందిని నియమించనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తెలిపారు. డిగ్రీ లేదా పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించడమే కాక బీఈడీ, టెట్ అర్హత ఉన్న గిరిజన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఖమ్మం రీజియన్ పరిధిలోని విద్యాలయాల్లో గణితం, ఫిజిక్స్, సైన్స్ బోధనకు అర్హత, ఆసక్తి వారు అన్ని సర్టిఫికెట్లతో గురువారం నుంచి శనివారం వరకు భద్రాచలం ఐటీడీఏలోని ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. కాగా, మహిళా విద్యాలయాల్లో మహిళలకు మాత్రమే ప్రాధాన్యత ఉంటుందని, మార్కులు, డెమోల ద్వారా ఎంపిక చేస్తామని పీఓ తెలిపారు.

అరవై రోజులు.. 17 మిలియన్ టన్నులు

- ఇంకా మిగిలిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం
- సింగరేణిలో ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు 90 శాతం ఉత్పత్తి



ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి జరుగుతున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం ఈ ఏడాది నిర్దేశించుకున్న వార్షిక లక్ష్య సాధనకు ఇంకా అరవై రోజుల సమయం ఉంది. ఈ గడువులోగా 17 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. అయితే, వార్షిక లక్ష్యసాధనలో ఏటా మాదిరిగానే ముందస్తు ప్రణాళికలు లేక, చివరి సమయంలో లక్ష్యసాధన పెంచి కార్మికులపై భారం మోపడం ఆనవాయితీగా వస్తోందని పలువురు వాపోతున్నారు. కాగా, సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లోని 24 భూగర్భ గనులు, 20 ఓపెన్‌కాస్ట్ గనుల్లో రోజుకు 2,85,200 టన్నుల ఉత్పత్తి లక్ష్యం కాగా.. 2,23,056 టన్నులు(78 శాతం) ఉత్పత్తి నమోదవుతోంది. ఇందులో భూగర్భగనుల్లో 70 శాతం, ఓపెన్‌కాస్ట్ గనులు 79 శాతం సాధించాయి. ఇక జనవరిలో పరిశీలిస్తే సింగరేణి వ్యాప్తంగా 68,44,800టన్నుల లక్ష్యానికి గాను 66,40,257 టన్నులు(97 శాతం) ఉత్పత్తి నమోదైంది. సంస్థ వ్యాప్తంగా గడిచిన పది నెలల్లో పరిశీలిస్తే 59.83 మిలియన్ టన్నుల లక్ష్యానికి గాను 53.86 మిలియన్ టన్నులే(90 శాతం) సాధించడం గమనార్హం.

మిగిలింది రెండు నెలలే...

ఈ ఏడాది కంపెనీ నిర్దేశించుకున్న వార్షిక లక్ష్యంలో ఇంకా సుమారు 17 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మిగిలిన రెండు నెలల్లో ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే నెలకు 8.5 మిలియన్ టన్నులు, రోజుకు సుమారు 3 లక్షల టన్నులు ఉత్పత్తి సాధించాల్సి ఉంది. అయితే, లక్ష్యం భారీగా ఉన్నా కార్మికులకు గతంలో మాదిరి ఇన్సెంటివ్ ప్రకటించకపోవడం వారిని నిరుత్సాహానికి గురి చేస్తోంది.

జనవరిలో ఏరియాల వారీగా ఉత్పత్తి (టన్నుల్లో)

ఏరియా	లక్ష్యం	ఉత్పత్తి	శాతం
ఇల్లెందు	2,76,920	4,88,000	176
మణుగూరు	10,13,952	12,81,848	126
ఆర్జీ-1	3,48,288	4,13,671	119
ఆర్జీ-2	7,22,592	8,14,434	113
ఆండ్రియాల	1,74,336	1,85,856	107
కొత్తగూడెం	13,16,160	13,32,142	101
శ్రీరాంపూర్	6,01,440	6,08,190	101
ఆర్జీ-3	6,14,400	6,08,190	90
బెల్లంపెల్లి	3,55,200	2,67,553	83
మందమర్రి	5,12,832	4,14,987	81
భూపాలపల్లి	4,87,680	2,67,553	55


నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాల్సిందే..



సమావేశంలో మాట్లాడుతున్న ఆజాద్

ఖమ్మంమయూరిసెంటర్: విద్యను కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేస్తూ అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానించడం ద్వారా సీఎం కేసీఆర్ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో రిజర్వేషన్లను రద్దు చేసే కుట్రలో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానాన్ని కేంద్రం రూపొందించిందని విమర్శించారు. ఇక తెలంగాణలో విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ప్రతీ బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తున్నారని మండిపడ్డారు. ఈసారైనా విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. అనంతరం టీపీటీఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శులు విజయ్, మధు, ఏఐఎస్ఎఫ్, ఎంఎస్ఎఫ్ నాయకులు సుభాన్, సురేశ్ మాట్లాడగా వివిధ సంఘాల బాధ్యులు ప్రవీణ్, సతీశ్, లక్ష్మణ్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సింగరేణి డైరెక్టర్లు



ఎన్‌వీకే.శ్రీనివాస్



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వరరెడ్డి, పక్కన డైరెక్టర్ బలరాం, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డైరెక్టర్లుగా నియమితులైన ఇద్దరు అధికారులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్‌వీకే.శ్రీనివాస్, డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి సింగరేణి కార్యాలయంలో మరో డైరెక్టర్ ఎన్.బలరాం సమక్షాన బాధ్యతలు స్వీకరించగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, వివిధ విభాగాల జీఎంలు, అధికారులు వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అధికారులు కె.బసవయ్య, సుధాకర్, కవితానాయుడు, కోడూరు శ్రీనివాసరావు, ధన్‌పాల్ శ్రీనివాస్, జీ.వీ.కిరణ్‌కుమార్, ముకుంద సత్యనారాయణ, ఎస్.వీ.రావు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పరిరక్షణ సమితి పేరిట సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఖమ్మంసహకారనగర్: ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల పరిరక్షణ సమితి పేరిట బుధవారం ఖమ్మంలో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నాయకులు ఎడవల్లి కృష్ణ, నున్నా రామకృష్ణ, ధరావత్ రామ్మూర్తినాయక్, పైడిపల్లి కిశోర్, రామసహాయం మాధవీరెడ్డి, పోటు లెనిన్, ముస్తఫా, మిక్కిలినేని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కష్టపడే నాయకులకు న్యాయం జరగకపోగా, పైరవీకారులకే పదవులు దక్కుతున్నాయనే అంశం ఈ సమావేశంలో చర్చకు వచ్చిందని నేతలు వెల్లడించారు. అలాగే, త్వరలో జరిగే హాత్ సే హాత్ యాత్రను విజయవంతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇంకా నాయకులు సూరంపల్లి రామారావు, పగడాల మంజుల, దళ్‌సింగ్, లక్కినేని సురేందర్, రావూరి వెంకటరామయ్య, నర్సింహారావు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు పూర్తి చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న జీఎం రమేశ్

సత్తుపల్లిరూరల్: బొగ్గు ఉత్పత్తి, రవాణాపై ప్రత్యేక శ్రద్ధ వహించి లక్ష్యాన్ని చేరుకోవాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేశ్ ఆదేశించారు. మండలంలోని జేవీఆర్, కిష్టారం ఓసీలను బుధవారం సందర్శించిన ఆయన అధికారులతో సమావేశమయ్యారు. రోజుకు 10 నుంచి 11 రేక్‌ల మేర బొగ్గు రవాణా చేయాలని తెలిపారు. కాగా, పలువురు తమకు డిప్యూటీ మేనేజర్‌గా పదోన్నతి ఇవ్వాలని జీఎంకు వినతిపత్రం అందించారు. ఏజీఎం సూర్యనారాయణ, పీఓలు వెంకటాచారి, నర్సింహారావుతో పాటు మధుసూదన్, రమణారెడ్డి, రామకృష్ణ, నూకరాజు పాల్గొన్నారు.



ఆటవిడుపుగా చేపల వేట !

మణుగూరులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ రేగా కాంతారావు.. ఆ తర్వాత నేర్లెచెరువు వద్ద కాసేపు ఆగి ఆటవిడుపుగా చేపల వేట చేశారు. అప్పటికే కొందరు యువకులు చేపలు పడుతుండడంతో ఎమ్మెల్యే సరదాగా వారితో కలిసిపోయారు. గాలాలు వేసి చేపలు పట్టడం గొప్ప థ్రిల్లింగ్ అంటూ సంతోషం వ్యక్తం చేశారు. – మణుగూరుటౌన్

సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 2 । ఫిబ్రవరి । 2023





తరలివచ్చిన సారలమ్మ..

చర్ల, దుమ్ముగూడెం, కరకగూడెం మండలాల్లో సమ్మక్క జాతర సాగుతోంది. రెండో రోజు సారలమ్మ గద్దెలపైకి వచ్చింది. 18లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
34° / 18°

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రత ఎక్కువగానే ఉంటుంది. రాత్రివేళ చలి ప్రభావం తగ్గుముఖం పడుతుంది.

న్యూస్‌రీల్

నలుగురు రామాలయ ఉద్యోగులకు మెమోలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో నలుగురు ఉద్యోగులకు ఈఓ శివాజీ బుధవారం మెమోలు జారీ చేశారు. ముక్కోటి ఉత్సవాల సందర్భంగా తయారుచేసిన లడ్డూలు బూజుపట్టిన స్థితిలో భక్తులకు అమ్మడం, దానిపై భద్రాచలం పస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. కాగా ఈ ఘటనపై దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ విచారణ చేసి అందించిన నివేదిక ఆధారంగా.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏఈఓ శ్రవణ్‌కుమార్, సూపరింటెండెంట్ సాయిబాబ, క్లర్క్ వాసు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రమేష్‌కు మెమోలు జారీ చేశారు. 24 గంటల లోపు కార్యాలయంలో వివరణ అందజేయాలని సూచించారు.

ముగిసిన జేఈఈ మెయిన్స్ పరీక్షలు

సుజాతనగర్ : జాతీయ స్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో గత నెల 24న ప్రారంభమైన జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ముగిశాయి. చివరి రోజు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం సెషన్‌లో 86 మంది విద్యార్థులకు గాను 84 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 85 మందికి గాను 84 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించండి



భోజనం తయారీని పరిశీలిస్తున్న డీఈఓ

ఇల్లెందు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని డీఈఓ ఎన్.ఎస్.ఎస్. ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన ఇల్లెందులోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. కుకింగ్ ధరలు పెంచినందున వాటికి అనుగుణంగా బిల్లులు సమర్పించాలని వర్కర్లకు సూచించారు. ఆయన వెంట ఎంఈఓ ఠాగూర్ రాంసింగ్, జిల్లా సెక్టోరియల్ అధికారులు నాగరాజ శేఖర్, సైదులు ఉన్నారు.

మొక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి



మొక్కలను పరిశీలిస్తున్న మధుసూదన్ రాజు

అన్నపురెడ్డిపల్లి: పంచాయతీ నర్సరీల్లో మొక్కల పెంపకంపై జాగ్రత్తలు పాటించాలని డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పెద్దిరెడ్డిగూడెం, గుంపెన, ఊటుపల్లి, అబ్బుగూడెం, మర్రిగూడెం గ్రామ పంచాయతీల్లోని నర్సరీలను బుధవారం ఆయన సందర్శించారు. మొక్కలను పరిశీలించి, పెంపకంపై అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. వేసవికాలం సమీపిస్తున్నందున మొక్కలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రేవతి, ఎంపీఓ షబ్నా తదితరులు పాల్గొన్నారు.

కొత్త రైళ్ల ఊసే లేదు..

ఈసారి బడ్జెట్ కూడా పూర్తిగా వందే భారత్, మెట్రో భారత్ వంటి కొత్త తరహా రైళ్లను ప్రవేశపెట్టడంపై ఫోకస్ చేసింది. ఫలితంగా భద్రాచలం రోడ్ – తిరుపతి, భద్రాచలంరోడ్ – షిర్డీ వంటి కొత్త రైళ్లపై ఆశలు ఆవిరైనట్టే. కనీసం మణుగూరు – కాజీపేట, కొల్హాపూర్/బెళగావి – మణుగూరు/ భద్రాచలంరోడ్, డోర్నకల్ – భద్రాచలం రోడ్ వంటి గతంలో నడిచిన రైళ్లను పునరుద్ధరిస్తే అదే పదివేలు అనుకునే పరిస్థితి నెలకొంది.

రైల్వేపై ఆశలు..

కేంద్ర బడ్జెట్‌లో 'కోల్ టూ పోర్ట్'కు ప్రాధాన్యం

- గిరిజన ప్రాంతాల కోసం ప్రత్యేక రైల్వే ప్లాన్
- మల్కన్‌గిరి – భద్రాచలంపై చిగురిస్తున్న ఆశలు
- నిధుల కోసం ఎదురు చూస్తున్న డబ్లింగ్ పనులు
- ఈసారైనా ఉడాన్‌లో కొత్తగూడేనికి చాన్స్ దక్కేనా ?

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బొగ్గు ఉత్పత్తి ప్రాంతాలు, పోర్టులను అనుసంధానిస్తూ వీటికి ఆహార ధాన్యాలు, ఎరువుల రవాణాను కలుపుతూ కొత్తగా రైలు మార్గాలు నిర్మిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం నాటి బడ్జెట్‌లో ప్రకటించారు. అయితే రైల్వే బడ్జెట్ పద్దులకు సంబంధించిన పింక్‌బుక్‌లో ఏ పనులకు ఎంత లెక్క రాశారో తెలియాలంటే మరో రెండు, మూడు రోజులు వేచి చూడాల్సిందే.

కోల్ – పోర్ట్ కనెక్టివిటీ..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బొగ్గు రవాణా – పోర్టు కనెక్టివిటీకి సంబంధించి మణుగూరు – రామగుండం, కొత్తగూడెం – కొండపల్లి, సత్తుపల్లి – కొవ్వూరు, భద్రాచలంరోడ్ – కొవ్వూరు రైలు మార్గాలు రైల్వే బోర్డు పరిశీలనలో ఉన్నాయి. ఇప్పటికే ఈ మార్గాల నిర్మాణ పనులకు పలుమార్లు సర్వే చేశారు. ఇందులో సత్తుపల్లి – కొవ్వూరు రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే బొగ్గు ఉత్పత్తి ప్రాంతాలకు సముద్ర తీరంలోని పోర్టులతో రైలు కనెక్టివిటీ పెరుగుతుంది. ప్రతీ బడ్జెట్‌లో కొవ్వూరు రైల్వే లైన్‌కు నిధుల కేటాయింపు ఉంటుందని ఎదురుచూడడం, ఆ తర్వాత నిరాశ చెందడం జిల్లావాసులకు ఆనవాయితీగా వస్తోంది.

అవకాశాలు ఎక్కువ..

పారిశ్రామికంగా, రవాణా పరంగా ఎక్కువ లాభసాటి రైల్వేలైన్‌గా రామగుండం – మణుగూరు మార్గం ఉంది. బొగ్గు గనులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఎరువుల తయారీ, టూరిజం ఇలా అనేక ప్రాంతాలను కలుపుతూ ఈ రైలు మార్గం వెళుతోంది. 197 కిలోమీటర్ల నిడివి గల ఈ రైలుమార్గం నిర్మాణానికి రూ. 3000 కోట్ల వ్యయంతో డీపీఆర్ కూడా సిద్ధమైంది. ఈసారి బడ్జెట్‌లో ఈ రైలు మార్గం నిర్మాణ పనులకు నిధులు వచ్చే అవకాశం ఉంది.

జన్‌జాతీ గౌరవ్..

గిరిజన ప్రాంతాల్లో రైల్వే కనెక్టివిటీ కోసం జన్‌జాతీ గౌరవ్ పేరుతో కొత్త ప్రాజెక్టులు చేపడతామని బడ్జెట్‌లో ప్రకటించారు. గిరిజన జనాభా అధికంగా ఉన్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఏపీలోని వీఆర్ పురం, కూనవరం వంటి ఏజెన్సీ ప్రాంతాల మీదుగా భద్రాచలం వరకు మల్కన్‌గిరి – భద్రాచలం పేరుతో సరికొత్త రైల్వే మార్గం నిర్మించేందుకు రైల్వే శాఖ ఇప్పటికే పలుమార్లు సర్వేలు నిర్వహించింది. ఇటీవల ట్రాక్ నిర్మాణానికి సంబంధించి భూ సామర్థ్య పరీక్షలు కూడా నిర్వహించి పూర్తి స్థాయిలో డీపీఆర్ సిద్ధం చేశారు. పైగా ప్రస్తుత రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఒడిశా రాష్ట్రానికి చెందినవారు. దీంతో ఈ మార్గం నిర్మాణం పట్ల ఆయన ఆసక్తిగా ఉన్నారు. అన్నీ అనుకూలిస్తే ఈ బడ్జెట్‌లో మల్కన్‌గిరి – భద్రాచలం నూతన రైలుమార్గం నిర్మాణానికి నిధులు వచ్చే అవకాశం ఉంది.

అమృత్ భారత్..

అమృత్ భారత్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా 1,275 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో ఖమ్మం, మధిర, భద్రాచలంరోడ్ రైల్వే స్టేషన్లు ఇప్పటికే అమృత్ భారత్‌లో చోటు దక్కించుకున్నాయి. ఈ స్టేషన్ల అభివృద్ధి ప్రణాళికలు రెడీ అవుతున్నాయి. డీపీఆర్‌లు సిద్ధమైతే ఇప్పటికే బడ్జెట్‌లో కేటాయించినందున స్టేషన్ల అభివృద్ధి త్వరితగతిన జరిగే అవకాశం ఉంది.

డబ్బులొస్తేనే డబ్లింగ్..

డోర్నకల్ నుంచి మణుగూరు వరకు ప్రస్తుతం ఉన్న రైలు మార్గం సింగిల్ లైన్‌గా ఉంది. ఈ మార్గం బొగ్గు రవాణాతో బిజీగా ఉంటుంది. ఫలితంగా ప్యాసింజర్ రైళ్లు తరచూ ఆలస్యంగా నడుస్తున్నాయి. ఆరు నెలల కిందట ఈ రైలు మార్గం డబ్లింగ్ పనులకు పాలనా పరమైన అనుమతులు వచ్చాయి. ఈ బడ్జెట్‌లో కేటాయింపులు జరిగితే టెండర్లు పిలిచే అవకాశం ఉంది.

ఎయిర్‌పోర్ట్‌పై కదలిక వచ్చేనా..

ఉడాన్ పథకం ద్వారా రాబోయే ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 50 వరకు ఎయిర్‌పోర్టులు, హెలిపోర్టులు, వాటర్ ఎయిర్‌డ్రోమ్స్ అభివృద్ధి చేస్తామని ఈ బడ్జెట్‌లో మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉంది. తాజాగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు/పట్టణాల్లో ఉడాన్ ద్వారా ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి కేంద్రం ప్రాధాన్యత ఇస్తుండటంతో మరోసారి కొత్తగూడెం ఎయిర్‌పోర్టు పనుల్లో కదలిక వచ్చేందుకు ఆస్కారం ఉంది.

అనైక్యతే కారణమా?

- రేవంత్ హాత్‌సే హాత్ జోడో యాత్రలో మార్పులు
- భద్రాచలానికి బదులు మేడారం నుంచి ప్రారంభం
- తాజాగా మీడియాకు వెల్లడించిన పీసీసీ చీఫ్
- ఉమ్మడి జిల్లాలో హస్తం బలప్రదర్శన అవకాశాలకు గండి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న హాత్ సే హాత్ జోడో యాత్ర ప్రారంభ స్థలి మారింది. ముందుగా నిర్ణయించినట్టు భద్రాచలం నుంచి కాకుండా ములుగు జిల్లా మేడారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం మీడియాకు వెల్లడించారు.

ప్రకటనలకే పరిమితం..

హాత్‌సే హాత్ జోడో పాదయాత్రను భద్రాచలం నుంచి ప్రారంభించేందుకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మొదట ఆసక్తి చూపించారు. తన నియోజకవర్గం నుంచే యాత్ర ప్రారంభించాలని భద్రాచలం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య సైతం రేవంత్‌రెడ్డిని పలుమార్లు కోరారు. ఆ తర్వాత యాత్రకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఉన్న నేతలను ఒక తాటిపైకి తేవడం, సన్నాహక సమావేశాలు నిర్వహించడం, రోడ్‌మ్యాప్ రూపొందించడం తదితర కార్యక్రమాలు కరువైపోయాయి. నియోజకవర్గాల వారీగా నేతలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తూ వచ్చారు.

ములుగు నుంచి షురూ..

పీసీసీ అధ్యక్షుడి యాత్ర నిర్వహణకు సంబంధించి జిల్లాలో ఆ పార్టీ నేతలు ఒక్కసారి కూడా సమావేశం కాలేదు. దీంతో రేవంత్ పాదయాత్ర భద్రాచలం నుంచి ఉంటుందా లేదా అనే సందేహాలు పార్టీ శ్రేణుల్లో వ్యక్తమయ్యాయి. వారి అనుమానాలను నిజం చేస్తూ హాత్ సే హాత్ జోడోయాత్రను ఈనెల 6న మేడారంలోని సమ్మక్క – సారలమ్మ గద్దెల ప్రాంగణం నుంచి ప్రారంభిస్తామని రేవంత్‌రెడ్డి బుధవారం ప్రకటించారు.

చాన్స్ మిస్..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది. గత ఎన్నికల్లో పది అసెంబ్లీ స్థానాలకు ఏడు చోట్ల పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. ఊరూవాడ అనే తేడా లేకుండా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంకు ఉంది. ఇలాంటి తరుణంలో పీసీసీ అధ్యక్షుడి యాత్ర భద్రాచలం నుంచి ప్రారంభమైతే పార్టీ పరంగా ఉత్సాహం వస్తుందని, టీడీపీ, సీపీఎం, బీఆర్ఎస్‌లకు దీటుగా బల ప్రదర్శన చేసే అవకాశం వస్తుందని కాంగ్రెస్ కార్యకర్తల్లో ఆశలు చిగురించాయి. అయితే చివరి నిమిషంలో యాత్ర ప్రారంభించే ప్రదేశం భద్రాచలం నుంచి ములుగుకు మారడం జిల్లాలోని ఆ పార్టీ అభిమానులకు మింగుడుపడడం లేదు. యాత్ర ప్రారంభించేందుకు అనువైన పరిస్థితులు, మౌలిక వసతులు, మీడియా కవరేజ్ తదితర అంశాల్లో మేడారం కంటే భద్రాచలం ఎన్నో విధాలుగా మెరుగు. అయినప్పటికీ యాత్రను ఈ జిల్లా నుంచి ప్రారంభించేలా చేయడంలో ఇక్కడి నాయకులు విఫలమయ్యారనే భావన ఆ పార్టీలో నెలకొంది.

అందరి దృష్టీ ఇక్కడే..

రాష్ట్ర రాజకీయాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా దిక్సూచీగా మారింది. రాబోయే సార్వత్రిక ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ఖమ్మంను వేదికగా చేసుకుని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఆ తర్వాత సీపీఎం సైతం ఇక్కడే సభ నిర్వహించింది. ఇదే తరుణంలో కాంగ్రెస్ పార్టీ సైతం ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్రకు మద్దతుగా తెలంగాణలో హాత్‌సే హాత్ జోడో పేరుతో పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం నుంచి యాత్ర ప్రారంభిస్తామని ఆ పార్టీ వర్గాలు డిసెంబర్‌లో వెల్లడించాయి. ఈ యాత్రకు సంబంధించి పూర్తి స్థాయిలో స్పష్టత రాకముందే సీఎం కేసీఆర్ అనూహ్యంగా బీఆర్ఎస్ ఆవిర్భావ సభ ఖమ్మంలో నిర్వహించి దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారు. ఇలా టీడీపీ, సీపీఎం, బీఆర్ఎస్ బల ప్రదర్శన చేయడంతో వారికి పోటీగా హాత్‌సే హాత్ పాదయాత్రతో తమ సత్తా చాటాలనే ఆకాంక్ష కాంగ్రెస్ కార్యకర్తల్లో కనిపించినా వారి కల ఫలించేలా లేదు.

ట్యూటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చుంచుపల్లి: కొత్తగూడెం వైద్య కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిపై స్పెషలిస్ట్ ట్యూటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 15 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.57,700 ఏకీకృత విధానంలో వేతనం చెల్లిస్తారని తెలిపారు. అనాటమీ, ఫిజియోలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మాకాలజీ, ఫోర్సినిక్ మెడిసిన్‌లో ట్యూటర్‌లుగా పని చేసేందుకు సంబంధిత సబ్జెక్ట్‌ల్లో ఎమ్మెస్సీ పూర్తి చేసిన వారు అర్హులని వివరించారు. అభ్యర్థులు ఈనెల 8 లోపు కొత్తగూడెం వైద్య కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రామాలయంలో వైభవంగా 'భీష్మ ఏకాదశి'

కనులపండువగా నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో బుధవారం భీష్మ ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్వామివారిని పల్లకీ సేవగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. ఈఓ శివాజీ దంపతులు స్వామివారికి పూలు, పండ్లు సమర్పించగా, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం, విష్ణు సహస్రనామార్చన గావించి హారతి సమర్పించారు.

నేత్రపర్వంగా నిత్యకల్యాణం

స్వామి వారికి బేడా మండపంలో నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, ఆలయంలో గురువారం నుంచి సహస్ర కలశాభిషేకోత్సవాలు



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

జరగనున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు స్వామివారి నిత్యకల్యాణాలు నిలిపివేస్తున్నట్లు ఆలయ ఆలయ ప్రకటించారు.

నిత్యాన్నదానానికి విరాళం..

దేవస్థానం సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఇల్లెందు సబ్‌జైల్ బస్తీకి చెందిన పప్పు సుధాకర్ రావు, సుజాత దంపతులు రూ.1,00,001 విరాళాన్ని ఆలయ ఈఓకు విరాళంగా అందజేశారు. ఈఓ వారికి రశీదు ఇచ్చారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులతో పాటు ఆలయ పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి

- ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచన
- స్టేషన్ బస్తీ పాఠశాల నుంచే తొలిమెట్టు మొదలు కావాలి
- 'మన ఊరు – మన బడి' ప్రారంభించిన కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: ప్రభుత్వం కల్పించిన సదుపాయాలతో విద్యా ప్రమాణాలు పెంచాలని కలెక్టర్ అనుదీప్ ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని స్టేషన్ బస్తీ ఉర్దూ, ఎంపీపీఎస్ పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే హరిప్రియతో కలిసి ఆయన ప్రారంభించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ.. చిన్నారుల బంగారు భవిష్యత్తుకు పాఠశాలలే ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. 'మన ఊరు – మన బడి' కార్యక్రమంలో జిల్లాలో 368 పాఠశాలల్లో మొదటి విడతలో సకల సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇల్లెందు స్టేషన్ బస్తీలోని ఈ రెండు పాఠశాలలకు సుమారు రూ. 62 లక్షలు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. రంగులు వేసుకుని మమ అనిపించకుండా, మౌలిక సదుపాయాల కల్పనలో 12 అంశాలను గుర్తించి ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. స్టేషన్ బస్తీ పాఠశాల నుంచే తొలిమెట్టు ప్రారంభం కావాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమ పోస్టర్, బ్రోచర్‌లో 8 ఫొటోలు ఉంటే అందులో 5 ఇల్లెందు స్టేషన్ బస్తీ పాఠశాలవే కావడం గర్వించదగిన విషయమన్నారు. ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపైనే దృష్టి కేంద్రీకరించిందని చెప్పారు. మన ఊరు – మన బడితో విద్యాసంస్థల రూపురేఖలు మారిపోతాయని, స్టేషన్ బస్తీ పాఠశాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు రావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో డీఈఓ ఎస్ఎస్ఎస్ ప్రసాద్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ డి. వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీపాషా, కౌన్సిలర్లు మొగిలి లక్ష్మి, సరిత, తహసీల్దార్ కృష్ణవేణి, కమిషనర్ అంకుషావలి, ఆర్అండ్‌బీ ఈఈ బి.బీమ్లా, డీఈ వి.వెంకటేశ్వరరావు, ఏఈ రాంబాబు, ఉద్యాన అధికారి మరియన్న, ఎంపీడీఓ అప్పారావు, ఎంఈఓ ఠాగూర్ రాంసింగ్ పాల్గొన్నారు.



ఉర్దూ పాఠశాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే హరిప్రియ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న చిన్నారులు

పోడు పట్టాల జారీకి చర్యలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పోడు సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాల జారీకి చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు పట్టాలు మంజూరుకు జిల్లాలో ఎస్టీలు 65,616 మంది, గిరిజనేతరులు 17,725 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రతి హ్యాబిటేషన్‌లో క్షేత్రస్థాయి కమిటీలు వేసి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం గ్రామసభల్లో ప్రజల సమక్షంలో తీర్మానాలు చేశామని, వాటిని డివిజన్ స్థాయి కమిటీకి సిఫారసు చేశామని చెప్పారు. ఆ తర్వాత పట్టాల జారీపై జిల్లా స్థాయి అటవీహక్కుల కమిటీ సమావేశంలో చర్చించి కొత్తగూడెం, భద్రాచలం డివిజన్ల పరిధిలోని హ్యాబిటేషన్ల నుంచి 11,532 దరఖాస్తులకు సంబంధించి 30,684.29 ఎకరాలకు పోడుపట్టాలు జారీ చేసేలా నిర్ణయించామని వివరించారు. మిగిలిన వాటిపై తిరిగి విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు స్వర్ణలత, రత్నకళ్యాణి, ఇల్లెందు ఎఫ్‌డీఓ నీరజ్‌కుమార్, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

ప్రగతి బాటలో పల్లెలు..

- గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- 2019 నుంచి మారిన రూపురేఖలు
- ప్రస్తుత పంచాయతీ పాలకవర్గాలకు నేటితో నాలుగేళ్లు



రామాంజనేయకాలనీ గ్రామపంచాయతీ వద్ద గతంలో అంతర్గత రహదారి



రామాంజనేయకాలనీలో ప్రస్తుతం నిర్మించిన సీసీ రోడ్డు

చుంచుపల్లి: గ్రామీణ ప్రజల జీవన విధానంలో మార్పు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చింది. దీంతో మారుమూల గ్రామాల్లోనూ మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన పంచాయతీలు మెరుగైన ఫలితాలు సాధించాయి. 2019 నుంచి ప్రతి పంచాయతీకి కార్యదర్శిని ఏర్పాటు చేయడంతో అభివృద్ధి పనులపై పర్యవేక్షణ పెరిగింది. గత నాలుగేళ్లలో పల్లెల్లో పారిశుద్ధ్యంతో పాటు పచ్చదనం మెరుగుపడ్డాయి. హరిత హారం మొక్కలతో ఆవాస గ్రామాలు, గిరిజన తండాలు, గూడేలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. రహదారులు మెరుగుపడడంతో మారుమూల గ్రామాలకు సైతం వైద్య, ఆరోగ్య సేవలు విస్తృతంగా అందుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల పర్యవేక్షణలో ఉపాధి పనులు పక్కాగా అమలవుతున్నాయి. సర్పంచుల్లో ఎక్కువ మంది విద్యావంతులు కావడంతో పాలనపై అవగాహనతో దూసుకెళ్తున్నారు.

పట్టణాలకు దీటుగా అభివృద్ధి..

జిల్లాలో 481 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో 2018లో కొత్తగా 276 పంచాయతీలు ఏర్పాటయ్యాయి. వీటన్నింటికీ కలిపి 2019 జనవరిలో ఎన్నికలు నిర్వహించగా, ఫిబ్రవరి 2న పాలకవర్గాలు కొలువుదీరాయి. రాష్ట్ర ప్రభుత్వం 2019 సెప్టెంబర్‌లో తొలిసారి పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టింది. దీంతో పల్లెల్లో ఉన్న ప్రధాన సమస్యలు పరిష్కారం అయ్యాయి. పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో పల్లెల రూపురేఖలు మారిపోయాయి. ప్రతి పంచాయతీలో శ్మశానవాటిక, డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనాలు, హరిత నర్సరీలు, క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు పెద్దపీట వేశారు. జిల్లాలో 1,280 పల్లె ప్రకృతి వనాలు, 480 డంపింగ్ యార్డులు, 481 వైకుంఠధామాలు, 481 హరిత నర్సరీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గ్రామానికో క్రీడా ప్రాంగణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు పాలకవర్గాలు సైతం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. దీంతో పట్టణాలకు దీటుగా పల్లెలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయి.

పల్లె ప్రగతిలో ప్రత్యేక స్థానం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక సంఘం నిధులు గ్రామపంచాయతీల అభివృద్ధికి భరోసాగా నిలుస్తున్నాయి. జిల్లాలోని 481 పంచాయతీలకు నెలకు రూ.10.32కోట్ల చొప్పున విడుదల చేస్తోంది. ఈ నిధులను పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీటి పథకాలతో పాటు పల్లె ప్రగతి పనుల నిర్వహణకు వినియోగిస్తున్నారు. పల్లెప్రగతి పనుల నిర్వహణకు సంబంధించి 2021లో రాష్ట్రంలో జిల్లాకు ప్రత్యేక స్థానం దక్కింది. పారిశుద్ధ్యం – పచ్చదనం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలు, పన్నుల వసూళ్లు, డంపింగ్‌యార్డుల నిర్వహణ.. మొత్తం ఆరు అంశాల్లో జిల్లా ఉత్తమంగా నిలిచింది.

నాలుగేళ్లుగా అభివృద్ధి చెందుతున్నాయి..



పల్లెలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో గ్రామ పంచాయతీలు అభివృద్ధి బాట పట్టాయి. నాలుగు విడతల్లో చేపట్టిన పల్లె ప్రగతి ద్వారా పంచాయతీల్లో ప్రధాన సమస్యలు పరిష్కారం అయ్యాయి. ప్రతి నెల జిల్లాకు వచ్చే ఆర్థిక సంఘం నిధులు గ్రామాలకు భరోసా కల్పిస్తున్నాయి. సమష్టి కృషితో గ్రామాల్లో సమగ్రాభివృద్ధి జరుగుతోంది.

– లక్ష్మీ రమాకాంత్, డీపీఓ

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీలు


బాధ్యతలు స్వీకరిస్తున్న గూడెం డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెం టౌన్/పాల్వంచ: కొత్తగూడెం, పాల్వంచ డీఎస్పీలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ కొత్తగూడెంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యమిస్తామని, ప్రజలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల ఎస్ఐగా, సీఐగా పనిచేసి 2021లో డీఎస్పీగా పదోన్నతి పొందినట్లు తెలిపారు. పాల్వంచ డీఎస్పీ ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం పాత పాల్వంచలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న పాల్వంచ డీఎస్పీ

నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

దమ్మపేట: సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణానికి భూములు కోల్పోయిన గిరిజనులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే కాలువ పనులు చేపట్టాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కార్యదర్శి ఆజాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన పేరుతో పత్రికా ప్రకటన విడుదలైంది. మండల పరిధిలోని కోడిసెగట్టు, ఆర్లపెంట గ్రామాల్లోని భూములు కోల్పోయిన గిరిజనులకు నష్టపరిహారం చెల్లించకుండా ప్రాజెక్ట్ నిర్మాణ పనులను చేపట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. అధికార పార్టీ నాయకులు, దళారులు నష్టపరిహారం విషయంలో కలుగజేసుకుని, అమాయక గిరిజన రైతుల నుంచి కమీషన్ వసూలు చేయడం హేయమైన చర్యఅని పేర్కొన్నారు. గిరిజనేతరులకు తక్కువ నష్టపరిహారం వస్తుందనే కారణంతో వారి భూములను గిరిజనుల పేర్లకు మార్పిడి చేసి పెద్దమొత్తంలో కమీషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి మండలాల్లో గల అధికార పార్టీ నాయకులు, దళారులు అధికారులను లోబరుచుకుని అక్రమ దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

5 నుంచి ఆదివాసీ సమ్మేళనం

భద్రాచలంటౌన్: ఆదివాసీ జాతీయ సాంస్కృతిక, సంప్రదాయ సమ్మేళనం భద్రాచలం కేంద్రంగా ఈ నెల 5 నుంచి 7 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు గుండు శరత్ తెలిపారు. గిరిజన అభ్యుదయ భవన్‌లో బుధవారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఐదో, ఆరో షెడ్యూల్ ప్రాంతాల్లో సుమారు 15 నుంచి 18 కోట్ల మంది ఆదివాసీలు అడవి, భూములను ఆసరాగా చేసుకొని వేలాది సంవత్సరాలుగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో ఆదివాసీల జీవన విధానం పట్ల, ఆదివాసీ అభివృద్ధి పట్ల ఏ రకమైన మార్పూ జరగలేదన్నారు. దేశంలోని అన్ని ఆదివాసీల జాతులను ఒకే వేదికపై తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా మూడు రోజులపాటు ఆదివాసీ గుస్సాడి, దండారి, కోయ రేలపాటలు, డోలు కోయలు, లక్ష్మీ దేవరులు, థింసా తదితర సాంస్కృతిక కళారూపాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కొమరం అనిల్‌కుమార్, సోడే వెంకట్, కుంజా ధర్మారావు, గొంది బాలయ్య, పూనెం వీరభద్రం, వజ్జ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కారు, లారీ ఢీ : నలుగురికి గాయాలు

పినపాక: మండల పరిధిలోని జానంపేట గ్రామ శివారులో బుధవారం కారు, లారీ ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ.బయ్యారం పోలీసుల కథనం ప్రకారం.. దమ్మపేట మండలం మల్కారం గ్రామానికి చెందిన తోట ఫణికుమార్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో మేడారం వెళ్తున్నారు. ఈ క్రమంలో జానంపేట శివారులో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఫణి కుమార్‌తో పాటు ఆయన అత్త, మామ సుజాత, నాగబాబుతో పాటు మరో బంధువు వెంకటలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో మణుగూరు వంద పడకల ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పరారు కాగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ దిలీప్ తెలిపారు.

కలప పట్టివేత

అశ్వాపురం: మండల కేంద్రంలో అక్రమంగా కలప రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను అశ్వాపురం ఫారెస్ట్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఫారెస్ట్ రేంజర్ ద్వాలియా తెలిపారు.

సెమీస్‌కు చేరిన ఎస్‌పీఎల్

- సీనియర్స్ విభాగంలో..
  ఉత్కంఠగా సాగిన క్వార్టర్ ఫైనల్స్
- నేడు సెమీస్ మ్యాచ్‌ల
  నిర్వహణకు ఏర్పాట్లు

ఖమ్మంస్పోర్ట్స్: 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్ కంపెనీ సౌజన్యంతో జరుగుతున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు సీనియర్స్ విభాగంలో సెమీస్ దశకు చేరాయి. నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా బుధవారం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. పలు కళాశాలల క్రీడాకారులు గెలుపు కోసం హోరాహోరీగా పోటీ పడ్డారు. కాగా, ఎస్‌బీఐటీ-1, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల, బొమ్మ ఫార్మసీ కళాశాల-ఖమ్మం, విజయ ఇంజనీరింగ్ కళాశాల-ఖమ్మం, వికాస్ డిగ్రీ కళాశాల-ఖమ్మం జట్లు క్వార్టర్ ఫైనల్ దశలో పోటీ పడగా.. గురువారం సెమీస్ మ్యాచ్‌లు జరగనున్నాయి. మ్యాచ్‌లను 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ గుడిమెట్ల మోహన్‌కృష్ణ, కేయూ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం కార్యదర్శి డాక్టర్ బి.వెంకన్న ప్రారంభించగా, సాక్షి ఈవెంట్ మేనేజర్ బోడపట్ల వేణు, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాధారపు రాజు, ఆర్సీ ఇన్‌చార్జ్ నెల్లూరి ఉపేందర్‌తో పాటు జుజ్జూరు ఉపేందర్, ఆసిఫ్, రామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్‌ల వివరాలు ఇలా...

■ సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల (సత్తుపల్లి) - విజయ ఇంజనీరింగ్ కళాశాల(ఖమ్మం) జట్ల మధ్య మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సాయిస్ఫూర్తి జట్టు నిర్ణీత ఓవర్లలో 53 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన విజయ ఇంజనీరింగ్ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 54 పరుగులతో విజయం సాధించింది.

■ కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల (ఖమ్మం) - కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల(పాల్వంచ) జట్ల నడుమ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన కవిత జట్టు నిర్ణీత ఓవర్లలో 57 పరుగులు చేసింది. ఆ తర్వాత కేఎల్ఆర్ జట్టు 51 పరుగులే చేయడంతో ఓటమి పాలైంది.

■ ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల (ఖమ్మం) - డీఆర్ఎస్ డిగ్రీ కళాశాల (ఖమ్మం) జట్ల మధ్య మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న డీఆర్ఎస్ జట్టు 52 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్‌బీఐటీ జట్టులో ఓపెనర్లు ఇద్దరే సునాయాసంగా లక్ష్యాన్ని చేధించారు.

■ వికాస్ డిగ్రీ కళాశాల (ఖమ్మం) - బ్రౌన్స్ ఫార్మసీ కళాశాల (ఖమ్మం) జట్ల మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వికాస్ జట్టు 58 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్రౌన్స్ జట్టు ఆశించిన స్థాయిలో పరుగులు చేయకపోవడంతో ఓటమి పాలైంది.

■ ఎస్‌బీఐటీ-1 ఇంజనీరింగ్ కళాశాల (ఖమ్మం) - అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల(కొత్తగూడెం) జట్ల మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన అబ్దుల్ కలాం జట్టు 64 పరుగులు చేసింది. ఆ తర్వాత ఎస్‌బీఐటీ-1 జట్టు లక్ష్యాన్ని అవలీలగా ఛేదించి విజయం సాధించింది.

■ ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల (ఖమ్మం) - కవిత డిగ్రీ కళాశాల (ఖమ్మం) జట్ల మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ జట్టు పరిమిత ఓవర్లలో 64 పరుగులు చేయగా, ఆ తర్వాత కవిత జట్టు 57 పరుగులే చేయగలగడంతో ఓటమి పాలైంది.

■ మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల (సత్తుపల్లి) - గీతాంజలి డిగ్రీ కళాశాల (ఖమ్మం) జట్ల నడుమ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన మదర్ థెరిస్సా కళాశాల జట్టు 111 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ జట్టులో సుజీవ్ 40, ప్రవీణ్ 24 పరుగులు చేశారు. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన గీతాంజలి డిగ్రీ కళాశాల జట్టు 44 పరుగులే చేయడంతో పరాజయం ఎదురైంది.

■ అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల (కొత్తగూడెం) - ఆర్జేసీ డిగ్రీ కళాశాల (ఖమ్మం) జట్ల నడుమ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆర్జేసీ డిగ్రీ కళాశాల జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 50 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన అబ్దుల్ కలాం కళాశాల జట్టు సునాయాసంగా లక్ష్యాన్ని చేధించింది.


సాయిస్ఫూర్తి - విజయ ఇంజనీరింగ్ కళాశాల జట్ల మధ్య మ్యాచ్


ఎస్‌బీఐటీ-1 కళాశాల జట్టు


ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల జట్టు


కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల జట్టు


విజయ ఇంజనీరింగ్ జట్టు

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు..

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లా రాజకీయవర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సామాన్యులను నిరాశ పరిచిందని ఒకరు పేర్కొనగా, కార్పొరేట్ బడ్జెట్ అని మరొకరు విమర్శించారు. ప్రజలకు మేలైన బడ్జెట్ అని ఇంకొకరు పేర్కొన్నారు.

-కొత్తగూడెంఅర్బన్/సింగరేణి (కొత్తగూడెం)/చుంచుపల్లి

మొండిచేయి చూపారు..



బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపింది. కొన్నేళ్లుగా ఊరిస్తున్న కొవ్వూరు రైల్వే లైన్‌కు ఇప్పుడు కూడా ఊరిస్తూనే ఉన్నారు. గిరిజన యూనివర్సిటీకి నిధులు నామమాత్రమే. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, విభజన చట్టం హామీల ప్రస్తావనే లేదు. ఉపాధి పథకానికి కూడా నిధులు తగ్గించారు. బడ్జెట్ తీరు చూస్తుంటే వ్యవసాయరంగం కుదేలయ్యేలా ఉంది. ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించేలా ఉంది. - యెర్రా కామేష్, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఇది సామాన్యుల బడ్జెట్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్య ప్రజలకు మేలు చేకూరే విధంగా ఉంది. ముఖ్యంగా ట్యాక్స్ విషయంలో ఆదాయ పరిమితి పెంచి సామాన్యులకు ఊరట కలిగించే విధంగా చేశారు. ఇక ఈ బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేశారు. సింగరేణి సంస్థకు భారీగా నిధులు కేటాయించటం అభినందనీయం.
- కోనేరు సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

పేదలకు అన్యాయం..



నిరుద్యోగ సమస్యలకు పరిష్కారం చూపేప్రయత్నం చేయలేదు. రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, గిరిజన యూనివర్సిటీ వంటి రాష్ట్రవిభజన హామీలను విస్మరించారు. జీఎస్టీలో రాష్ట్రాల వాటా పెంపులేదు. ప్రభుత్వరంగాన్ని కాపాడేలా లేదు. ధాన్యం కొనుగోలు ప్రోత్సాహకాలు తగ్గించారు. క్రాప్ ఇన్స్‌రెన్స్‌కు కోత పెట్టారు. పేదలకు అన్యాయం చేశారు. - ఎస్కే సాబీర్‌పాష, సీపీఐ జిల్లా కార్యదర్శి

తమాషా రాజకీయాలు నడుస్తున్నాయ్..

- డబ్బుతో కార్యకర్తలను కొనలేరు
- ప్రభుత్వ విప్ రేగా కాంతారావు


మాట్లాడుతున్న రేగా కాంతారావు

భద్రాచలం: జిల్లాలో తమాషా రాజకీయాలు నడుస్తున్నాయని, డబ్బుతో పార్టీ కార్యకర్తలను, నాయకులను కొందరు అయోమయానికి గురి చేస్తున్నారని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పేర్కొన్నారు. బుధవారం భద్రాచలం హరిత హోటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నుంచి బయటికొస్తే వారికి ఉన్న కార్యకర్తల బలమెంతో తెలుస్తుందని, వారికి జిల్లాలో అన్ని దారులు మూసుకుపోయాయని అన్నారు. ప్రగల్భాలు పలికే బీజేపీ తెలంగాణాలో అమలు చేస్తున్న పథకాలను తమ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయగలదా? అని ప్రశ్నించారు.

భద్రాచలం ఎమ్మెల్యే టూరిస్టు నాయకుడు

భద్రాచలం నియోజకవర్గంతోపాటు జిల్లాలోని అన్ని స్థానాల్లో రానున్న ఎన్నికలలో బీఆర్ఎస్ విజయదుందుభి మోగిస్తుందని రేగా జోస్యం చెప్పారు. మరో జిల్లా నుంచి వచ్చి భద్రాచలంలో గెలిచిన పొదెం వీరయ్య సాధించిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. అప్పుడప్పుడు నియోజకవర్గానికి వస్తూ టూరిస్టు నాయకుడిలా మారాడని విమర్శించారు. దళితబంధు పథకం లబ్ధిదారుల నుంచి కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అనంతరం బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అరికెల తిరుపతిరావు, కే కృష్ణమూర్తి, నాయకులు మానె రామకృష్ణ, బుచ్చయ్య, అన్నెం సత్యాలు, ప్రమోద్ కుమార్, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో ముదురుతున్న వర్గపోరు


స్వపక్ష నాయకుల తీరుపై ఆవేదన వ్యక్తం చేస్తున్న ఎంపీపీ పార్వతి

చంద్రుగొండ : మండల బీఆర్ఎస్ పార్టీలో వర్గపోరు ముదిరిపాకాన పడింది. మండల పరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో బుధవారం జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం సభా వేదిక విభేదాల పర్వానికి పరాకాష్టగా నిలిచింది. పార్టీ మండల అధ్యక్షుడు దారా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తనపై చేసిన విమర్శలను ఎంపీపీ పార్వతి ప్రస్తావించారు. తనపై విమర్శలు చేసేందుకు మీరెవరూ .. నేను టీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి ఎంపీపీగా ఎన్నికయ్యాను. మీరు మధ్యలో వచ్చారు.. అంటూ పార్టీ మండల అధ్యక్షుడు దార వెంకటేశ్వరరావును ఉద్దేశించి ఎంపీపీ వ్యాఖ్యానించారు. ఓ సొసైటీ డైరెక్టర్‌పై కూడా ఎంపీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన మహిళననే తనను చులకనగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలానికి వచ్చే అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారం తనకు ఇవ్వకపోవడమేమిటని ప్రశ్నించారు. అయినా తన పంచాయితీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో, మీకెందుకు మధ్యలో ఇకనైనా హద్దుల్లో ఉండండంటూ ఆవేశంగా హెచ్చరించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రసూల్ సర్ది చెప్పే ప్రయత్నం చేయగా.. మీరు కూడా విమర్శలు చేశారంటూ బదులిచ్చారు. తనకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని ఎంపీపీ తేల్చిచెప్పారు.

కాంట్రాక్ట్ కార్మికురాలి ఆత్మహత్యాయత్నం

ఇల్లెందు: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికురాలు బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కాంట్రాక్ట్ కార్మికురాలు ఉమ మున్సిపాలిటీలోని 21వ వార్డులో 15 ఏళ్లుగా పని చేస్తోంది. ఆమెను మరో వార్డుకు మార్చు చేయడంతో మనస్తాపం చెంది ఫినాయిల్ తాగింది. కుటుంబీకులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై కమిషనర్ అంకుషావళీని వివరణ కోరగా.. ఈ విషయం తెలియదని, ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని కోరారు.

తరలివచ్చిన తల్లి సారలమ్మ..

రెండో రోజూ జాతరలో సందడి


చర్ల: అబ్బూరాశిబండల వద్ద ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు


దుమ్ముగూడెం: సారలమ్మను తీసుకొస్తూ..


కరకగూడెం: ఇలవేల్పులకు స్వాగతం పలుకుతున్న ఆదివాసీ పూజారులు

చర్ల: చినమేడారం జాతరకు రెండో రోజూ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రసిద్ధిగాంచిన ఎదిరగుట్టల జాతర మంగళవారం ప్రారంభం కాగా, బుధవారం సారలమ్మ తల్లి గద్దెలకు చేరింది. ఉదయం గిరిజన పూజారులు సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సమీపంలోని సోముల దేవమ్మ గుట్టకు వెళ్లి అక్కడి నుంచి సారలమ్మను తోడ్కొని వచ్చారు. ఈ క్రమంలో అబ్బురాశిబండల వద్ద ఎదుర్కోలు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తల్లిని తోడ్కొని వస్తుండగా భక్తులు పూనకాలతో ఊగిపోయారు. సారలమ్మను గద్దెపై ప్రతిష్టించిన అనంతరం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ బి.భరణిబాబు, శోభాయాత్ర ఉత్సవ కమిటీ సభ్యులు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, గిరిజన సంఘాల పెద్దలు పాల్గొన్నారు. కాగా గురువారం సమ్మక్క తల్లిని గుండంతోగు గుట్టల నుంచి తీసుకురానున్నారు.

మారాయిగూడెంలో..

దుమ్ముగూడెం: మారాయిగూడెం గ్రామంలో శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సాహంగా కొనసాగుతోంది. బుధవారం సారలమ్మను గద్దెలపైకి తీసుకొచ్చారు. దేవరబాలలు సోడి శాంతమ్మ, అచ్చమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల జయజయధ్వానాలు, కోయ డప్పులు, సన్నాయి మేళాల నడుమ తల్లిని ఊరేగింపుగా తీసుకొచ్చి కొలువుదీర్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

కరకగూడెంలో..

కరకగూడెం: మండల పరిధిలోని చిరుమల్ల గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతర మంగళవారం రాత్రి 10 గంటలకు మండమెలుగు కార్యక్రమంతో ప్రారంభమైంది. బుధవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి భారీగా ఇలవేల్పులు సమ్మక్క గద్దెకు చేరుకుంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. డోలు వాయిద్యాలు, ముత్యాలతో స్వాగతం పలుకుతున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర, భిక్షపతి, భూపతయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో ప్రతిభ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏజెన్సీకి చెందిన 33 మంది యువతీ యువకులు కేరళలోని కొచ్చిలో జరిగిన యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గత నెల 23 నుంచి 29వ తేదీ వరకు అక్కడ పర్యటించి సంస్కృతీ సంప్రదాయాలను అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమాన్ని సీఆర్పీఎఫ్ 141వ బెటాలియన్, ఖమ్మం ఎన్‌వైకే నిర్వహించగా, ఏజెన్సీ యువత ప్రతిభ చూపి బహుమతులు సాధించారు. బుధవారం వారిని సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు అభినందించి ప్రత్యేక బహుమతులు ఇచ్చారు. 141 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్ దర్, లతీఫ్ కుమార్ సాహు, కమల్వీర్ యాదవ్, సింగరవేల్, విజయ్ కిషోర్ రెడ్డి, హేమంత్ కుమార్ శర్మ, రాజ్‌కుమార్, రమాదేవి, డిప్యూటీ డైరెక్టర్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీఎఫ్ సేవలకు అభినందనలు


108లో ప్రయాణికుడిని తరలిస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: గుండెపోటుకు గురైన రైలు ప్రయాణికుడిని సురక్షితంగా ఆస్పత్రికి తరలించిన ఆర్‌పీఎఫ్ సిబ్బందిని పలువురు అభినందించారు. మణుగూరు-సికింద్రాబాద్ రైలు మంగళవారం తెల్లవారుజామున భద్రాచలం స్టేషన్‌కు వస్తోంది. ఈ క్రమంలో కారేపల్లి స్టేషన్ సమీపంలో అందులో ఓ ప్రయాణికుడు గుండెపోటుకు గురయ్యాడు. దీంతో పక్కన ఉన్నవారు ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించగా, వారు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నవారికి సమాచారం అందించారు. రైలు స్టేషన్‌కు వచ్చే సరికి 108 వాహనం సిద్ధం చేయగా, బాధితుడిని ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. ఈ విషయం సోషల్ మీడియాలో బుధవారం వైరల్ కాగా, ఆర్పీఎఫ్ సిబ్బందిని పలువురు అభినందించారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

భద్రాచలం అర్బన్: చెల్లని చెక్కు కేసులో ఓ వ్యక్తికి జైలుశిక్ష విధించారు. వివరాలు ఇలా.. భద్రాచలం అశోక్‌నగర్ కాలనీకి చెందిన ఐటీడీఏ ఉద్యోగి కన్నేటి భాస్కర్ రావు నుంచి సారపాకకు చెందిన కాంట్రాక్టర్ బెల్లం కొండశౌరి రూ.10 లక్షలను అప్పుగా తీసుకున్నాడు. హామీగా చెక్కు ఇచ్చాడు. చెక్కును బ్యాంక్‌లో డిపాజిట్ చేయగా ఖాతాలో సరిపడా నగదులేక బౌన్స్ అయింది. దీంతో భాస్కర్‌రావు తన న్యాయవాది చైతన్య ద్వారా కోర్టులో కేసు వేశారు. వాదోపవాదాల అనంతరం భద్రాచలం న్యాయమూర్తి.. కొండశౌరికి 6 నెలల జైలు శిక్ష విధించారు. రెండు నెలలలోపు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, లేకపోతే మరో మరో మూడు నెలలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

వేధింపుల కేసు నమోదు

దమ్మపేట: వివాహితను లైంగికంగా వేధించిన వ్యక్తిపై బుధవారం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం... వడ్లగూడెం గ్రామానికి చెందిన ఓ వివాహిత పట్ల కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన వంశీ అనే యువకుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. దీంతో బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

జ్వరంతో మహిళ మృతి

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని మైబూనగర్‌లో జ్వరంతో మహిళ మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై విజయ కథనం ప్రకారం.. మైబూనగర్ గ్రామానికి చెందిన షేక్ అనీషా(26) కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి సయ్యద్ అహ్మద్ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.


అత్యాచారయత్నంపై కేసు నమోదు

ములకలపల్లి : అత్యాచారయత్నం ఘటనలో బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... పూసుగూడెం గ్రామానికి చెందిన వల్లెపు లీల అనే మహిళతో ఆమె భర్త స్నేహితుడు రాముడు కొంతకాలంగా అసభ్యకరంగా మాట్లాడుతున్నాడు. సోమవారం రాత్రి ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో అత్యాచారానికి యత్నించాడు. అదే సమయంలో ఆమె భర్త కొండల్‌రావు రావడంతో పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ తిరుమలరావు తెలిపారు.

అండర్‌-19 ప్రపంచకప్‌ విజేత జట్టుకు బీసీసీఐ సన్మానం

ఐసీసీ తొలిసారి నిర్వహించిన అండర్‌-19 మహిళల టి20 ప్రపంచకప్‌ను సాధించిన టీమిండియా సభ్యులను భారత క్రికెట్‌ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం అహ్మదాబాద్‌లో ఘనంగా సన్మానించింది. న్యూజిలాండ్‌తో ఆఖరి టి20 పోరుకు ముందు జరిగిన ఈ వేడుకలో బోర్డు ప్రకటించిన రూ. 5 కోట్ల నజరానాను భారత దిగ్గజం సచిన్‌ చేతుల మీదుగా అండర్‌-19 జట్టు కెప్టెన్‌ షఫాలీ వర్మ అందుకుంది. అమ్మాయిలు అద్భుతంగా రాణించారని కితాబిచ్చిన 'మాస్టర్‌'... ఈ ఘనతతో మరెంతో మంది మహిళా క్రికెటర్ల కలలకు ఊపిరి పోశారని అన్నారు.





గిల్‌

గిల్‌ జిగేల్‌...

- భారత ఓపెనర్‌ మెరుపు సెంచరీ
- ఆఖరి టి20 పోరులో టీమిండియా 168 పరుగులతో విజయం
- కివీస్‌పై 2-1తో సిరీస్‌ సొంతం

అహ్మదాబాద్‌: మోదీ స్టేడియంలో భారత్‌ పరుగుల మోత మోగించింది. 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' శుబ్‌మన్‌ గిల్‌ (63 బంతుల్లో 126 నాటౌట్‌; 12 ఫోర్లు, 7 సిక్సర్లు) తన బ్యాటింగ్‌ సునామీని చూపించాడు. దీంతో ఆఖరి టి20లో టీమిండియా 168 పరుగుల భారీ తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి 2-1తో సిరీస్‌ గెలుచుకుంది. మొదట భారత్‌ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. రాహుల్‌ త్రిపాఠి (22 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరిపించాడు. అనంతరం న్యూజిలాండ్‌ 12.1 ఓవర్లలో 66 పరుగులకే కుప్పకూలింది. 'ప్లేయర్‌ ఆఫ్‌ ద సిరీస్‌' హార్దిక్‌ పాండ్యా నాలుగు వికెట్లు తీశాడు.

గిల్‌ విధ్వంసం

ఇషాన్‌ కిషన్‌ (1) రెండో ఓవర్లోనే నిష్క్రమించగా... గిల్‌, త్రిపాఠి కివీస్‌ బౌలర్లపై ఆకాశమే హద్దుగా చెలరేగారు. రెండో వికెట్‌కు ఈ జోడీ మెరుపులతో 7 ఓవర్ల వ్యవధిలోనే భారత్‌ 80 పరుగులు చేసింది. తర్వాత సూర్యకుమార్‌ (13 బంతుల్లో 24; 1 ఫోర్‌, 2 సిక్సర్లు) వేగంగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యాడు. కెప్టెన్‌ హార్దిక్‌ పాండ్యా క్రీజులోకి రాగా... 15 ఓవర్లలో భారత్‌ స్కోరు 156/3. శుబ్‌మన్‌ 44 బంతుల్లో 67 పరుగులతో ఉన్నాడు. గిల్‌ అప్పటిదాకా ఒక ఆట, 16వ ఓవర్‌ నుంచి మరో ఆట ఆడాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడిన గిల్‌... లిస్టర్‌, టిక్నర్‌, ఫెర్గూసన్‌ ఎలా ఎవరెదురైనా... బంతుల్ని అదేపనిగా బౌండరీ దాటించాడు. పాండ్యా ఆడిన బంతుల్ని మినహాయిస్తే... గిల్‌ 16 బంతులను వరుసగా 0, 6, 6, 1, 6, 4, 0, 6, 1, 4, 6, 1, 4, 1, 4, 6లుగా దంచేశాడు. దీంతో 4 ఓవర్లలోనే భారత్‌ 72 పరుగులు చేసింది. ఇందులో 56 పరుగులు గిల్‌వే! ఈ క్రమంలో 54 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఆఖరి ఓవర్లో పాండ్యా (17 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్‌) అవుట్‌కాగా కేవలం 6 పరుగులే వచ్చాయి.

భారత్‌ పేస్‌కు కివీస్‌ బ్యాటర్స్‌ వణికారు. మూడో ఓవర్లోనే కివీస్‌ 7 పరుగులకే 4 వికెట్లను కోల్పోవడంతో భారత్‌ విజయానికి బాటపడింది. మిచెల్‌, సాన్‌ట్నర్‌ మాత్రమే రెండంకెల స్కోరు చేశారు.



సిరీస్‌ ట్రోఫీతో కెప్టెన్‌ హార్దిక్‌

స్కాన్‌ చేయండి
ఈ రోజు హైలైట్‌ కొరకు

స్కోరు వివరాలు

భారత్‌ ఇన్నింగ్స్‌: ఇషాన్‌ (ఎల్బీడబ్ల్యూ) (బి) బ్రేస్‌వెల్‌ 1; గిల్‌ (నాటౌట్‌) 126; త్రిపాఠి (సి) ఫెర్గూసన్‌ (బి) సోధి 44; సూర్యకుమార్‌ (సి) బ్రేస్‌వెల్‌ (బి) టిక్నర్‌ 24; పాండ్యా (సి) బ్రేస్‌వెల్‌ (బి) మిచెల్‌ 30; హుడా (నాటౌట్‌) 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 234.**
వికెట్ల పతనం: 1-7, 2-87, 3-125, 4-228.
బౌలింగ్‌: లిస్టర్‌ 4-0-42-0, బ్రేస్‌వెల్‌ 1-0-8-1, ఫెర్గూసన్‌ 4-0-54-0, టిక్నర్‌ 3-0-50-1, ఇష్‌ సోధి 3-0-34-1, సాన్‌ట్నర్‌ 4-0-37-0, మిచెల్‌ 1-0-6-1. **న్యూజిలాండ్‌ ఇన్నింగ్స్‌:** అలెన్‌ (సి) సూర్య (బి) పాండ్యా 3; కాన్వే (సి) పాండ్యా (బి) అర్ష్‌దీప్‌ 1; చాప్‌మన్‌ (సి) ఇషాన్‌ (బి) అర్ష్‌దీప్‌ 0; ఫిలిప్స్‌ (సి) సూర్య (బి) పాండ్యా 2; మిచెల్‌ (సి) మావి (బి) ఉమ్రాన్‌ 35; బ్రేస్‌వెల్‌ (బి) ఉమ్రాన్‌ 8; సాన్‌ట్నర్‌ (సి) సూర్య (బి) మావి 13; ఇష్‌ సోధి (సి) త్రిపాఠి (బి) మావి 0; ఫెర్గూసన్‌ (సి) ఉమ్రాన్‌ (బి) పాండ్యా 0; టిక్నర్‌ (సి) ఇషాన్‌ (బి) పాండ్యా 1; లిస్టర్‌ (నాటౌట్‌) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (12.1 ఓవర్లలో ఆలౌట్‌) 66. వికెట్ల పతనం:** 1-4, 2-4, 3-5, 4-7, 5-21, 6-53, 7-53, 8-54, 9-66, 10-66. **బౌలింగ్‌:** హార్దిక్‌ పాండ్యా 4-0-16-4, అర్ష్‌దీప్‌ సింగ్‌ 3-0-16-2, ఉమ్రాన్‌ మాలిక్‌ 2.1-0-9-2, కుల్దీప్‌ యాదవ్‌ 1-0-12-0, శివమ్‌ 2-0-12-2.

126 అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత క్రికెటర్‌గా శుబ్‌మన్‌ గిల్‌ (126 నాటౌట్‌) గుర్తింపు పొందాడు. కోహ్లి (122 నాటౌట్‌; అఫ్గానిస్తాన్‌పై 2022 లో) పేరిట ఉన్న రికార్డును గిల్‌ సవరించాడు.

168 అంతర్జాతీయ టి20ల్లో పరుగుల తేడా పరంగా భారత్‌కిదే అతిపెద్ద విజయం. 2018లో ఐర్లాండ్‌పై 143 పరుగుల తేడాతో సాధించిన విజయం రెండో స్థానానికి వెళ్లింది.

5 భారత్‌ తరఫున మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20లు) సెంచరీ సాధించిన ఐదో క్రికెటర్‌గా గిల్‌ నిలిచాడు. గతంలో రైనా, కేఎల్‌ రాహుల్‌, రోహిత్‌, కోహ్లి ఈ ఘనత సాధించారు.

ఆంధ్ర 379 ఆలౌట్‌

ఎడమచేతి వాటంతో బ్యాటింగ్‌ చేసిన విహారి



విహారి

ఇండోర్‌: డిఫెండింగ్‌ చాంపియన్‌ మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్వార్టర్‌ ఫైనల్‌ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 127.1 ఓవర్లలో 379 పరుగులకు ఆలౌటైంది. రెండో రోజు ఆటలో ఆంధ్ర కెప్టెన్‌ హనుమ విహారి (27; 3 ఫోర్లు) చేతి గాయంతో బాధపడుతున్నా జట్టు అవసరాలరీత్యా ఎడమచేతి వాటం బ్యాటింగ్‌ చేయడం హైలైట్‌గా నిలిచింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి మధ్యప్రదేశ్‌ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. ప్రస్తుతం మధ్యప్రదేశ్‌ మరో 235 పరుగులు వెనుకంజలో ఉంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్‌ రెండు వికెట్లు తీయగా... నితీశ్‌ కుమార్‌ రెడ్డి, పృథ్వీరాజ్‌ ఒక్కో వికెట్‌ తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్‌ స్కోరు 262/2తో ఆట కొనసాగించిన ఆంధ్ర ఒకదశలో 323/2తో పటిష్టంగా కనిపించింది. అయితే సెంచరీ పూర్తి చేసుకున్న కరణ్‌ షిండే (110; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు)... రికీ భుయ్‌ (149; 18 ఫోర్లు, 1 సిక్స్‌) ఐదు పరుగుల తేడాలో అవుటయ్యాక ఒక్కసారిగా ఆంధ్ర ఇన్నింగ్స్‌ కుప్పకూలింది. 30 పరుగుల తేడాతో ఆంధ్ర జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 353/9గా నిలిచింది. ఈ దశలో తొలి రోజు ఆటలో గాయపడి రిటైర్డ్‌ హర్ట్‌గా వెనుదిరిగిన కెప్టెన్‌ హనుమ విహారి క్రీజులోకి వచ్చాడు. చేతి గాయాన్ని లెక్కచేయకుండా తన సహజశైలి కుడిచేతి వాటం బదులుగా ఎడమచేతి వాటంతో విహారి బ్యాటింగ్‌ చేసి ఔరా అనిపించాడు. చివరి వరుస బ్యాటర్‌ లలిత్‌ మోహన్‌ (22 నాటౌట్‌; 3 ఫోర్లు)తో కలిసి హనుమ విహారి 26 పరుగులు జోడించి సారాంశ్‌ జైన్‌ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరగడంతో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌ ముగిసింది.

జాతీయ స్కూల్స్‌ చెస్‌లో తెలంగాణకు ఏడు పతకాలు



యశ్వి జైన్‌

సాక్షి, హైదరాబాద్‌: జాతీయ స్కూల్స్‌ చెస్‌ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాల పంట పండించారు. తమిళనాడులో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణకు ఏడు పతకాలు లభించాయి. ఇందులో ఐదు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం ఉన్నాయి. అండర్‌-15 బాలుర విభాగంలో వేముల అద్వైత్‌ విఘ్నేశ్‌ (7.5 పాయింట్లు)... అండర్‌-15 బాలికల విభాగంలో యశ్వి జైన్‌ (7 పాయింట్లు)... అండర్‌-13 బాలుర విభాగంలో చల్లా సహర్ష (8 పాయింట్లు)... అండర్‌-11 బాలికల విభాగంలో మోదిపల్లి దీక్షిత (7.5 పాయింట్లు)... అండర్‌-9 బాలికల విభాగంలో పుంగవనం సంహిత (8 పాయింట్లు) పసిడి పతకాలు గెలిచారు. అండర్‌-7 బాలుర విభాగంలో ఆదుళ్ల దివిత్‌ రెడ్డి (7.5 పాయింట్లు) కాంస్యం, అండర్‌-7 బాలికల విభాగంలో బోగా వంశిక (7 పాయింట్లు) రజతం సాధించారు. పతకాలు సాధించిన వారికి నెలనెలా భారత గ్రాండ్‌మాస్టర్‌ ఎం.శ్యామ్‌సుందర్‌తో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని తెలంగాణ రాష్ట్ర చెస్‌ సంఘం అధ్యక్షుడు కేఎస్‌ ప్రసాద్‌ ప్రకటించారు.

ప్రిక్వార్టర్స్‌లో సాయిప్రణీత్‌



బ్యాంకాక్‌: థాయ్‌లాండ్‌ ఓపెన్‌ సూపర్‌-300 బ్యాడ్మింటన్‌ టోర్నీలో హైదరాబాద్‌ ప్లేయర్‌ సాయిప్రణీత్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్‌ తొలి రౌండ్‌లో సాయిప్రణీత్‌ 21-13, 21-14తో మాడ్స్‌ క్రిస్టోఫర్సన్‌ (డెన్మార్క్‌)పై గెలుపొందాడు. మరో మ్యాచ్‌లో కిరణ్‌ జార్జి (భారత్‌) 21-17, 19-21, 23-21తో చెయుక్‌ యి లీ (హాంకాంగ్‌)ను ఓడించాడు. అయితే భారత్‌కే చెందిన సమీర్‌ వర్మ, ప్రియాన్షు రజావత్‌, మిథున్‌ మంజునాథ్‌ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. ప్రియాన్షు 21-14, 19-21, 25-27తో హియో క్వాంగ్‌ హీ (దక్షిణ కొరియా) చేతిలో... సమీర్‌ వర్మ 14-21, 16-21తో లీ షి ఫెంగ్‌ (చైనా) చేతిలో.. మిథున్‌ 18-21, 12-21తో నిషిమోటో (జపాన్‌) చేతిలో ఓడిపోయారు. మిక్స్‌డ్‌ డబుల్స్‌ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి-రోహన్‌ కపూర్‌ జోడీ 21-11, 21-16తో టై అలెగ్జాండర్‌-జోసెఫిన్‌ వు (కెనడా) ద్వయంపై గెలుపొంది ప్రిక్వార్టర్‌ ఫైనల్‌ చేరింది.

సినిమా

జైసల్మేర్‌లో జైలర్‌



రజనీకాంత్‌

రాజస్థాన్‌లోని జైసల్మేర్‌కు వెళ్లారు 'జైలర్‌'. రజనీకాంత్‌ హీరోగా నెల్సన్‌ దిలీప్‌కుమార్‌ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జైలర్‌'. రమ్యకృష్ణ, తమన్నా, శివరాజ్‌ కుమార్‌ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలో మోహన్‌లాల్‌ ఓ అతిథి పాత్ర చేస్తున్నారు. ఇటీవలే చెన్నైలో ఒక భారీ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న 'జైలర్‌' చిత్ర యూనిట్‌ ఇప్పుడు 'జైసల్మేర్‌'కు చేరుకుంది. ఈ షూటింగ్‌లో పాల్గొనడానికి ఆల్రెడీ రాజస్థాన్‌లో ల్యాండ్‌ అయ్యారు రజనీకాంత్‌. ఈ షెడ్యూల్‌ దాదాపు రెండు వారాలు జరగనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రజనీకాంత్‌ – మోహన్‌లాల్‌పై కీలక సన్నివేశాలను ప్లాన్‌ చేశారని సమాచారం. ఇక ఈ చిత్రం ఈ ఏడాది ఆగస్టులో విడుదలయ్యే అవకాశం ఉంది.

హెలికాప్టర్‌లో షూటింగ్‌కి...

హెలికాప్టర్‌లో షూటింగ్‌ లొకేషన్‌కు వెళుతున్నారు కమల్‌హాసన్‌. 1996లో హీరో కమల్‌హాసన్‌, దర్శకుడు శంకర్‌ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్‌' సినిమాకు సీక్వెల్‌గా వీరిద్దరి కాంబినేషన్‌లోనే 'ఇండియన్‌ 2' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్‌ ప్రస్తుతం కడపలోని గండికోట విలేజ్‌లో జరుగుతోంది. తిరుపతి నుంచి గండికోట లొకేషన్‌కు రోజూ హెలికాప్టర్‌లో వెళ్తున్నారు కమల్‌హాసన్‌. కాగా కమల్‌ హెలికాప్టర్‌ రైడ్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్‌ మీడియాలో వైరల్‌ అవుతున్నాయి. ఈ చిత్రం షూటింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి, కాల్షీట్స్‌, షూటింగ్‌ సమయం వృథా కాకుండా చూసేందుకు కమల్‌ ఇలా హెలికాప్టర్‌ రైడ్‌ చేస్తున్నారన్నది కోలీవుడ్‌ టాక్‌. కాజల్‌ అగర్వాల్‌ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్‌, రకుల్‌ప్రీత్‌సింగ్‌, బాబీ సింహా కీ రోల్స్‌ చేస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది.



కమల్‌హాసన్‌

పల్లెటూరి ప్రేమ

పార్వతీశం, జశ్విక జంటగా వైభవ్‌ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తెలుసా.. మనసా..'. వర్షా ముందాడ, మాధవి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌ లుక్‌ను 'దిల్‌' రాజు విడుదల చేశారు. వైభవ్‌ మాట్లాడుతూ– ''ఓ గ్రామంలో బెలూన్స్‌ అమ్ముకునే మల్లిబాబు (పార్వతీశం), అదే ఊర్లో పనిచేసే హెల్త్‌ అసిస్టెంట్‌ సుజాత (జశ్విక)ను ప్రేమిస్తాడు. అయితే సుజాతకు మల్లిబాబు దూరం కావాల్సి వస్తుంది. ఆ తర్వాత వారిద్దరూ కలుసుకున్నారా? లేదా అనేది చిత్ర కథ'' అన్నారు. ''న్యూ ఏజ్‌ లవ్‌ స్టోరీ చిత్రమిది'' అన్నారు వర్షా ముందాడ, మాధవి.



'శశివదనే'లో ఓ దృశ్యం

ఆ పేరుని తెరపై చూడాలనుకున్నా!

- శౌరి చంద్రశేఖర్‌ టి. రమేష్‌

''మా నాన్న చంద్రశేఖర్‌గారు ప్రతివారం నన్ను ఏదో ఒక సినిమాకి తీసుకెళ్లేవారు. అలా చిన్నతనంలోనే సినిమాలపై ఇష్టం మొదలైంది. మా నాన్నగారు చనిపోయాక ఆయన పేరుని నా పేరులో పెట్టుకున్నాను. ఆ పేరుని తెరపై చూడాలనే నా కోరిక 'బుట్టబొమ్మ' ద్వారా తీరుతుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు శౌరి చంద్రశేఖర్‌ టి. రమేష్‌. అనిఖా సురేంద్రన్‌, సూర్య వశిష్ఠ, అర్జున్‌ దాస్‌ ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'బుట్టబొమ్మ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 4న విడుదల కానుంది. ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్న చంద్రశేఖర్‌ టి.రమేష్‌ మాట్లాడుతూ– ''రామ్‌ గోపాల్‌ వర్మ గారి కార్పొరేషన్‌లో పని చేశాను. ఈశ్వర్‌ నివాస్‌గారు దర్శకత్వం వహించిన నాలుగు హిందీ సినిమాలకు పని చేశాను. ఆ తర్వాత సుకుమార్‌గారి వద్ద 'జగడం' నుంచి 'పుష్ప' సినిమా వరకు పని చేశాను. మలయాళ మూవీ 'కప్పేల'ని సితార వారు రీమేక్‌ చేస్తున్నారని తెలిసి, నేనే సంప్రదించాను. 'కప్పేల'లోని మెయిన్‌ పాయింట్‌ తీసుకొని తెలుగు నేటివిటీకి తగ్గట్టు 'బుట్టబొమ్మ'లో మార్పులు చేశాం. ఈ మూవీ తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది'' అన్నారు.



శౌరి చంద్రశేఖర్‌

పదిహేనేళ్ల తర్వాత....



విజయ్‌, త్రిష

దాదాపు పదిహేనేళ్ల తర్వాత జోడీ కట్టారు హీరో విజయ్‌– హీరోయిన్‌ త్రిష. మహేశ్‌బాబు 'ఒక్కడు' తమిళ రీమేక్‌ 'గిల్లి' (2004)లో తొలిసారి జోడీ కట్టారు విజయ్‌, త్రిష. ఆ తర్వాత 'తిరుపాచ్చి'(2005), (తెలుగులో 'అన్నవరం'గా రీమేక్‌ అయ్యింది) తెలుగు 'అతనొక్కడే'కు తమిళ రీమేక్‌ 'ఆది' (2006), 'కురివి' (2008) సినిమాల్లో జంటగా నటించారు. తాజాగా విజయ్‌ కెరీర్‌లో 67వ చిత్రంగా తెరకెక్కుతున్న మూవీలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న విషయాన్ని చిత్ర యూనిట్‌ ప్రకటించింది. దీంతో విజయ్‌, త్రిష ఐదోసారి స్క్రీన్‌ షేర్‌ చేసుకున్నట్లవుతుంది. 'మాస్టర్‌' తర్వాత హీరో విజయ్‌, దర్శకుడు లోకేష్‌ కనగరాజ్‌ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఇది. సంజయ్‌ దత్‌, ప్రియా ఆనంద్‌, అర్జున్‌ సర్జా, గౌతమ్‌ మీనన్‌ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్‌.

వింతగా మారబోతోంది



బ్రహ్మానందం

తరుణ్‌ భాస్కర్‌ దాస్యం దర్శకత్వంలో భరత్‌ కుమార్‌, శ్రీపాద్‌ నందిరాజ్‌, ఉపేంద్ర వర్మ, శ్రీనివాస్‌ కౌశిక్‌, సాయికృష్ణ గద్వాల్‌, విజయ్‌ కుమార్‌ నిర్మిస్తున్న చిత్రం 'కీడా కోలా'. ఎనిమిది ప్రధాన పాత్రలతో ఈ మూవీ రూపొందుతోంది. వారిలో బ్రహ్మానందం ఒక కీలక పాత్ర చేస్తున్నారు. బుధవారం బ్రహ్మానందం పుట్టినరోజు సందర్భంగా ఆయన ఫస్ట్‌ లుక్‌ను విడుదల చేశారు. 'మీ ప్రపంచం వింతగా మారబోతోంది' అని పోస్టర్‌పై క్యాప్షన్‌ ఇచ్చారు. ''ప్రతి ఇంట్లో ఉండే తాత పాత్రలో (వరదరాజు) బ్రహ్మానందంగారు కనిపిస్తారు'' అన్నారు తరుణ్‌ భాస్కర్‌.

తెరపైకి జాక్సన్‌ జీవితం

పాప్‌ సంగీత సామ్రాజ్యానికి రాజుగా వెలిగిన మైఖేల్‌ జాక్సన్‌ జీవితంతో 'మైఖేల్‌' పేరుతో బయోపిక్‌ రూపొందనుంది. ఈ చిత్రానికి ఆంటోయిన్‌ ఫుక్వా దర్శకుడు. మైఖేల్‌గా ఆయన సోదరుడు జెర్మైన్‌ కుమారుడు జాఫర్‌ జాక్సన్‌ నటించనున్నారు. వెండితెరపై యాక్టర్‌గా జాఫర్‌కు ఇదే తొలి చిత్రం. ''మా అంకుల్‌ కథలో నటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను'' అన్నారు జాఫర్‌. ''మైఖేల్‌ జాక్సన్‌ లక్షణాలు జాఫర్‌లో చాలా ఉన్నాయి. మైఖేల్‌గా నటించగల ఒకే ఒక్క వ్యక్తి జాఫర్‌ అని నమ్ముతున్నాను'' అన్నారు నిర్మాతల్లో ఒకరైన గ్రాహం. ఇక 1958 ఆగస్టు 29న పుట్టిన మైఖేల్‌ జాక్సన్‌ 2009 జూన్‌ 25న మరణించిన విషయం తెలిసిందే.



మైఖేల్‌



జాఫర్‌

లవ్‌.. యాక్షన్‌



రక్షిత్‌, కోమలి

రక్షిత్‌ అట్లూరి, కోమలీ ప్రసాద్‌ జంటగా సాయి మోహన్‌ ఉబ్బన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శశివదనే'. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్‌ కానుంది. శరవణ వాసుదేవన్‌ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'శశివదనే..' టైటిల్‌ సాంగ్‌ని డైరెక్టర్‌ హరీష్‌ శంకర్‌ రిలీజ్‌ చేశారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించిన ఈ పాటని హరిచరణ్‌, చిన్మయి శ్రీపాద పాడారు. ''లవ్‌, యాక్షన్‌ డ్రామాగా రూపొందిన చిత్రమిది'' అన్నారు సాయి మోహన్‌. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్‌ ప్రొడ్యూసర్‌: శ్రీపాల్‌ చోలేటి, కెమెరా: సాయికుమార్‌.

అయోమయంలో...



రణధీర్‌, శుభశ్రీ

రణధీర్‌, శుభశ్రీ జంటగా ఊర శ్రీను దర్శకత్వంలో 'అయోమయంలో అరవింద' సినిమా ఆరంభం అయింది. డాక్టర్‌ ప్రసాద్‌ మూరెళ్ల సహకారంతో లెక్కల మహేంద్రా రెడ్డి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి వి. శ్రీనివాసరెడ్డి కెమెరా స్విచ్చాన్‌ చేయగా, తుమ్మలపల్లి రామసత్యనారాయణ క్లాప్‌ కొట్టారు. మేడిది వెంకటేశ్వరరావు గౌరవ దర్శకత్వం వహించారు. ''సస్పెన్స్‌ క్రైమ్‌ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది'' అన్నారు ఊర శ్రీను. ''ఇప్పటివరకు వచ్చిన కథలకు భిన్నంగా మా చిత్రకథ ఉంటుంది'' అన్నారు మహేంద్రా రెడ్డి. ''ఈ చిత్రంలో మంచి సందేశం ఇస్తున్నాం'' అన్నారు ప్రసాద్‌ మూరెళ్ల. ఈ చిత్రానికి కెమెరా: జి.అమర్‌, సంగీతం: శివ కాకాని.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 371/A/AA, Thanikella Village, Konijerla Mandal, Khammam Dist - 507 305, T.G., and Printed at Jagati Publications Limited, Survey No. 371/A/AA, Thanikella Village, Konijerla Mandal, Khammam Dist - 507 305, T.G., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08742-282823 - 24, Fax No.08742 - 282825, RNI Regn No. TEL TEL/2008/23797.